ఆవగింజలతో పరమశివుడు

నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆవగింజలతో ఆదిదేవుడైన శివుడి చిత్రాన్ని రూపొందించాడు. రెండు రోజుల పాటు కష్టపడి కోటేష్ శివయ్య మోమును చిత్రీకరించాడు. ఇందుకోసం 3,250 ఆవగింజలను వినియోగించాడు.ఈ చిత్రంలో తలపై గంగ, సిగలో నెలవంక, మెడలో నాగరాజు భక్తులకు స్వామి దీవిస్తున్నట్లు చిత్రాన్ని వేశారు. - నంద్యాల కల్చరల్




గజ వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు


భక్తుల కోలాటాలు


కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు


శంఖానాదం చేస్తున్న సాధువు

గజవాహనంపై ఆదిదేవుడి వైభవం

నేడు శ్రీశైలంలో మహా శివరాత్రి, కల్యాణోత్సవం

అద్భుత ఘట్టం పాగాలంకరణకు సర్వం సిద్ధం


మహిషాసురమర్దిని అలంకారణలో కళాకారులు


పల్లకిపై ఊరేగుతున్న శ్రీశైలం పీఠాధిపతి


శ్రీశైలానికి కాలి నడకన వెళ్తున్న భక్తులు










మాఢ వీధులు, పాతాళగంగ వద్ద భక్తుల రద్దీ


శ్రీశైలం, మార్చి 7: ఇల కైలాసం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన గజవాహనంపై కొలువుదీర్చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం నుంచి వెలుపలికి తోడ్కొనివచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ఎదుట కోలాటం, చెక్కభజన, రాజభటుల వేశాలు, బీరప్పడోలు, తప్పెట్లు తదితర కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

నేడు కల్యాణోత్సవం

శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, రాత్రి 7 గంటలకు నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, రాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవార్లకు కల్యాణమహోత్సవం జరిపించనున్నారు.

అద్భుత ఘట్టం పాగాలంకరణ

శివరాత్రి పర్వదినాన అన్ని శివ క్షేత్రాల్లో స్వామి అమ్మవార్ల వివాహ మహోత్సవం జరుగుతుంది. అయితే శ్రీశైలం క్షేత్రంలో జరిగే కార్యక్రమాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ పెళ్లి కుమారుడిగా ముస్తాబయ్యే శివుడికి పాగాలంకరణ కార్యక్రమం జరుగుతుంది. మిగతా ఏ శైవ క్షేత్రంలోనూ ఇలాంటి వేడుక జరగదు. లింగోద్భవ సమయం దగ్గరపడగానే పాగాలంకరణ కార్యక్రమం కూడా మొదలవుతుంది. అది ముగిసే సమయానికి పాగాలంకరణ కార్యక్రమం పూర్తవుతుంది.


ఆలయ ప్రధాన ద్వారం ఎదుట గజవాహనంపై శ్రీశైలేశుడు



ఈ కార్యక్రమం సమయంలో భక్తులు ఆలయం లోపల ఉండేందుకు ఆసక్తి చూపుతారు.


పాదయాత్రగా తరలివస్తున్న భక్తులు

● మూడు తరాలుగా..

బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి తలపాగా చుట్టే కార్యక్రమాన్ని మూడు తరాలుగా ఒంగోలు జిల్లా చీరాల మండలం, హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం చేస్తోంది. ఏడాది పాటు మల్లన్న దీక్షలో నిష్టగా ఉండి రోజుకు ఓ మూర చొప్పున 365 మూరల వస్త్రాన్ని నేస్తారు. ఇలా పూర్తిగా నేసిన తర్వాత ఈ వస్త్రాన్ని భక్తి శ్రద్ధలతో హస్తినాపురంలో ఊరేగిస్తారు. ఆ తర్వాత స్వామి వారి సన్నిధికి తరలిస్తారు. పాగాలంకరణ చేసే సమయంలో ప్రధాన ఆలయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఆ తర్వాత పృథ్వీ వెంకటేశ్వర్లు దిగంబరుడై పాగాలంకరణ సేవను మొదలుపెడతాడు. ఈ సమయంలో ప్రధాన ఆలయంపైన ఎలాంటి వెలుగు పడనివ్వకుండా అలాగే సెల్‌ఫోన్లతో ఫొటోలు తీయనివ్వకుండా దేవస్థాన సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటారు.

అవినీతిపై విజయం సాధిద్దాం

- ● అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం
- ● ప్రజలకు నారా భువనేశ్వరి పిలుపు
- ● పత్తికొండ ప్రాంతంలో 'నిజం గెలవాలి' పర్యటన
- ● బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం


కడమకుంట్లలో వడ్డే చిన్నరంగన్న కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం


నారా భువనేశ్వరిని చూసేందుకు తరలివచ్చిన జనం


మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పత్తికొండ/తుగ్గలి/క్రిష్ణగిరి, మార్చి 7 : అవినీతిపై విజయం సాధించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె కర్నూలు జిల్లా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో పర్యటించారు. పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడిలో తరలి వచ్చి జనసందోహాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రం అన్ని విధాల వెనకబడి పోయిందని, కనీసం రాజధాని కూడా లేని దారుణ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామన్నారు. ఇలాంటి పరిస్థితిలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే టీడీపీతోనే సాధ్యమని చెప్పారు. అధికారం కోసం వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచకాలకు తెగబడే అవకాశాలు ఉన్నాయని, ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఆదోని ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ..

పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి మండలం మిథే తండాకు మధ్యాహ్నం 1.40 గంటలకు చేరుకున్నారు. చంద్రబాబునాయుడు అరెస్టుతో గుండె పోటుకు గురై మరణించిన మాజీ ఎంపీటీసీ రమావత్ లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి నివాళులర్పించారు. రమావత్ లక్ష్మి కుమారుడు స్వామినాయక్‌కు రూ.3 లక్షల ఆర్థిక సాయం చెక్‌ను అందించారు. 2.35 గంటలకు తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామానికి చేరుకున్నారు. చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన వడ్డె చిన్నరంగన్న కుటుంబాన్ని పరామర్శించారు. భార్య నాగేంద్రమ్మకు రూ.3 లక్షల ఆర్థిక సాయం చేశారు. 4.30 గంటలకు క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చేరుకొని పింజరి సుభాన్ కుటుంబాన్ని పరామర్శించారు. సుభాన్‌కు ఒక కూతురు, ఇద్దరు కుమారులు సంతానం. కూతురు ఆస్మకు పుట్టుకతోనే కళ్లు కనిపించవని కేఈ శ్యాంబాబు వారి పరిస్థితి గురించి వివరించారు. దీంతో భువనేశ్వరి వారిని దగ్గరకు తీసుకుని చిన్నారి కంటి చూపు బాధ్యత తీసుకుంటామని, అలాగే చిన్నారులను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని హామీ ఇచ్చారు. రూ3.లక్షల ఆర్థిక సాయం చేశారు.

భువనేశ్వరికి ప్రజల ఆత్మీయ పలకరింపు..

పత్తికొండ నియోజకవర్గంలోని మిథే తండా, కడమకుంట్ల గ్రామాలలో నారా భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చారు. వృద్ధులు ఆమెను చూసేందుకు ఇబ్బందులు పడడం గమనించి వారి వద్దకు వెళ్లి పలకరించారు. క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్ గ్రామంలో ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో మైక్ తీసుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పత్తికొండ, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, చల్లా రవీంద్రనాథ్ చౌదరి, సోమ్లానాయక్ పాల్గొన్నారు.



అలిగేర గ్రామంలో..

ఆస్పరి, మార్చి 7: మండలంలోని అలిగేర గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉరుకుందప్ప కుటుంబానికి అండగా ఉంటామని నారా భువనేశ్వరి అన్నారు. గురువా రం అలిగేర గ్రామంలో ఉరుకుందప్ప భార్య శేషమ్మకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిలు కోట్ల సూజాతమ్మ, మీనాక్షి నాయుడు, శ్యాంబాబు, నియోజకవర్గ నాయకురాలు వైకుంఠం జ్యోతి, గుడిసె కృష్ణమ్మ, పరమారెడ్డి, ఎంపీటీసీ రహిమతుల్లా, సతీష్ కుమార్, కృష్ణ యాదవ్, కైరుప్పుల వరప్రసాద్, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్యాలకుర్తిలో పర్యటన

కోడుమూరు (రూరల్), మార్చి 7: మండలంలోని ప్యాలకుర్తికి శుక్రవారం నారా భువనేశ్వరి రానున్నారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను నిజం గెలవాలి పేరుతో ఆమె పరామర్శిస్తున్నారు. పర్యటనలో భాగంగా ప్యాలకుర్తిలో సీనియర్ నాయకుడు నాగార్జునగౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను భువనేశ్వరి అందజేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



మిర్చి రైతులకు న్యాయం చేయండి

● అక్రమాలకు చెక్ పెట్టాలి ● ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా


మిర్చి ప్లాట్‌ఫారం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

కర్నూలు (అగ్రికల్చర్), మార్చి 7: కర్నూలు మార్కెట్ యార్డులో దశాబ్ద కాలంగా మిర్చి రైతులను వ్యాపారులు అక్రమాలతో ముంచెత్తుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ఆరోపించారు. గురువారం నగరంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో మిర్చి ప్లాట్‌ఫారం వద్ద రైతులకు సంఘీభావం తెలుపుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సురేంద్ర యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్నాథం మాట్లాడుతూ 20 రోజులుగా ఎండు మిర్చి ధర భారీగా తగ్గిపోవడానికి కారణం వ్యాపారులు సిండికేట్‌గా మారడమేనని ఆరోపించారు. క్వింటం 24వేల నుంచి 22 వేల దాకా ఉన్న ధర ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.5 వేలకు పడిపోయిందన్నా రు. ఎకరాకు మిర్చి పం ట సాగు కోసం రైతు రూ.2 లక్షల దాకా ఖర్చు పెడుతున్నారని, కనీసం పది క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రూ.లక్ష మాత్రమే రైతుల చేతికి అందే అవకాశం ఉందని అన్నారు. దీని వల్ల రైతులకు అప్పులు తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటానికి రూ.25వేల ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, రామక్రిష్ణ, రాజాగౌడు, శ్రీనివాసులు, పంపన్నగౌడు తదితరులు ఉన్నారు.

ఏపీ పీజీ సెట్‌కు ఆర్‌యూ వీసీ

కర్నూలు(అర్బన్), మార్చి 7: ఏపీపీజీ సెట్ 2024 నిర్వాహక కమిటీ సభ్యుడిగా రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ బీ. సుధీర్ ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే. హేమచంద్రారెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్, ముఖ్య కార్యదర్శి సభ్యులుగా ఉండే ఈ కమిటీకి సెట్ నిర్వాహక విశ్వవిద్యాలయమైన ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంత విశ్వవిద్యాలయాల వీసీల నుంచి ఆర్‌యూ ఉపకులపతికి అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలతో పాటు, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న ఏపీ పీజీ సెట్ 2024 విధి విధానాలకు సంబంధించి గురువారం ఆన్‌లైన్‌లో సమావేశం జరిగింది. సెట్ నోటిఫికేషన్ నుంచి వివిధ కోర్సులకు సంబంధించిన సిలబస్‌ను, ప్రశ్నపత్రాల నమూనా, అర్హతలు, పరీక్షా కేంద్రాలతోపాటు జూన్ 4 నుంచి 8 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణలోని వివిధ అంశాలను చర్చించారు. దరఖాస్తు ఫీజు, మూల్యాంకనం, ర్యాంకుల కేటాయింపు మొదలైన విషయాల గురించి చర్చించారు. కమిటీ సభ్యులుగా ఎంపికైన ఉప కులపతిని రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ నాగుల అంకన్న, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్‌లు వెంకటసుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్, వివిధ శాఖల ఆధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


యాగంటిలో ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న ఈవో, చైర్మన్

బనగానపల్లె, మార్చి 7 : బనగానపల్లె మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడి, ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్ శర్మ, కిశోర్, చిన్నస్వామి, ఆనందశర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని రామతీర్థం గ్రామంలో బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో, పసుపుల గ్రామ సమీపంలో ఉన్న గుండం మల్లికార్జునస్వామి ఆలయంలో, పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వైసీపీకి భారీ షాక్

పార్టీని వీడి 115 కుటుంబాలు టీడీపీలో చేరిక


బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన సుంకేసుల వాసులు

బనగానపల్లె, మార్చి 7: అవుకు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గురువారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అవుకు మండలం సుంకేసుల గ్రామంలోని వైసీపీకి చెందిన 115 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీకి చెందిన కైప వెంకటరామిరెడ్డి, కైప చంద్రశేఖర్‌రెడ్డి, మంచాల వీర ప్రతాప్‌రెడ్డి, సాధుకొట్టం శ్రీనివాసులరెడ్డి, వేములపాడు శివారెడ్డి, మంచాల భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరాముల దేవదానం, క్రిష్టిపాడు వలి, బత్తుల మహేశ్, అర్జునాపురం సుబ్రమణ్యం, మద్దనపు రమణ, కోమతి గంగన్న, చాకలి పుల్లయ్య తదితర వైసీపీకి చెందిన కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి బీసీ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ మాట్లాడుతూ సుంకేసుల గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

దేవనకొండ, మార్చి 7: చికిత్స పొందుతూ గురువారం ఓ రైతు మృతి చెందాడు. దేవనకొండ మండలం గుడిమిర్ల గ్రామానికి చెందిన నల్లబోతుల నరసింహుడు (38) బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రైతు నరసింహుడు గురువారం ఉదయం మృతి చెందాడు. నరసింహుడు తనకున్న 15 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ.60 లక్షల మేర అప్పులు చేశాడు. గతేడాది భూమిని కొంత మేర అప్పులు చెల్లించాడు. ఇంకా అప్పులు అలాగే ఉండటం, రుణదాతల నుంచి ఒత్తిళ్ల అధికంగా రావడంతో నరసింహుడు తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సోమేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహానందిలో శివరాత్రి శోభ

- సూర్య ప్రభ వాహనంపై ఊరేగిన దేవదేవుడు
- నేడు లింగోద్భవ పూజలు


మహానందిలో సూర్య ప్రభ వావాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

మహానంది, మార్చి 7: మహానంది క్షేత్రం గురువారం మహా శివరాత్రి ఉత్సవ శోభ కనిపించింది. రాష్ట్రంలోని దేవాలయాల నుంచి తరలి వచ్చిన రుత్వికులతోపాటు ఆలయ వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం యాగశాల మండపంలో హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఊరేగించారు. రాత్రి రావణ వాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతులతో పాటు కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహానందిలో లింగోద్భవ పూజలు: బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన లింగోద్భవ పూజలను శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి ప్రధాన ఆలయంలో గర్భాలయంలో వేదపండితులు నిర్వహిస్తారు. లింగోద్భవ సమయంలో భక్తులకు దర్శనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం తెల్లవారు జామున 3 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల కళ్యాణం జరుపుతారు.

జీరో వ్యాపారంపై మహా చెక్ తనిఖీలు

- సెస్సు లక్ష్యాన్ని సాధిస్తాం: ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 7: జీరో వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న దళారులు, వ్యాపారులపై చర్యలు చేపట్టేందుకు మహా చెక్ పేరుతో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. గురువారం నగరంలోని మార్కెటింగ్ శాఖ ఏడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ సెస్సు లక్ష్యాలను సాధించేందుకు మహాచెక్ పేరుతో ఆకస్మిక తనిఖీలు చెక్‌పోస్టుల్లో నిర్వహించాలని ఆదేశించినట్లు వివరించారు. కర్నూలు మార్కెట్ కమిటీకి రూ.6.15 కోట్ల సెస్సును వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఇప్పటికే రూ.6.51 కోట్ల సెస్సును సాధించారని తెలిపారు. ఆదోని మార్కెట్ కమిటీలో రూ.16.10 కోట్ల సెస్సును వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే రూ.11.95 కోట్ల సెస్సును మాత్రమే వసూలు చేసినట్లు ఏడీఎం తెలిపారు. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.4.50 కోట్ల సెస్సును వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటికే రూ.5.18 కోట్ల సెస్సును సాధించినట్లు తెలిపారు. ఆలూరు మార్కెట్ కమిటీలో రూ.1.05 కోట్ల సెస్సు వసూలుకుగాను రూ.1.05 కోట్లు, పత్తికొండలో రూ.75 లక్షల సెస్సుకుగాను రూ.69.31 లక్షలు, కోడుమూరులో రూ.1.90 కోట్లకుగాను రూ.1.25 కోట్లు, మంత్రాలయంలో రూ.80 లక్షలకుగాను రూ.1.01 కోట్లు వసూలు చేశామన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ఆంక్షలు

- గూడ్స్ వాహనాల దారి మళ్లింపు
- పలుచోట్ల పోలీసు చెక్‌పోస్టుల ఏర్పాటు



నల్లమలలోని ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు (ఫైల్)

ఆత్మకూరు, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి తరలి వెళ్లే గూడ్స్ వాహనాలపై పోలీసు, రవాణా శాఖలు పలు ఆంక్షలు విధించాయి. గతంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాల్లో నల్లమల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మీదుగా గూడ్స్ వాహనాలపై నిబంధనలు అమలు చేశారు. ఆత్మకూరు మీదుగా దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాలు, భారీ వాహనాలను దారి మళ్లించి నంద్యాల టర్నింగ్, వెలుగోడు మీదుగా నంద్యాల, గిద్దలూరు నుంచి దారి మళ్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ఈ నిబంధనలను ఇలాగే కొనసాగించనున్నట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. కాగా శుక్రవారం ఉదయం నుంచి శ్రీశైలానికి వెళ్లే వాహనాలను పూర్తిగా నిలిపివేయనున్నారు. పాగాలంకరణ అనంతరం శ్రీశైలం నుంచి దోర్నాలకు వచ్చే వాహనాలు మినహాయిస్తే ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. అవసరమైతే ట్రాఫిక్ పర్యవేక్షణాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సు సర్వీసులకు మాత్రమే శ్రీశైలం ఘాట్ రోడ్డులోకి అనుమతించనున్నారు. ఇప్పటికే ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్, బైర్లూటి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఘాట్ రోడ్డులోకి భారీ వాహనాలను అనుమతించకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా శుక్రవారం ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీ మరింత పెరగనున్న నేపథ్యంలో రోళ్ల పెంట ఘాట్ వద్ద కూడా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచి ఏదైనా ట్రాఫిక్ జామ్ తలెత్తితే సత్వరమే చర్యలు తీసుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవానికి నాగార్జున సాగర్-శ్రీశైలం అభయారణ్యం మీదుగా వెళ్లే కర్నూలు-గుంటూరు రహదారి సింగిల్ లైన్‌గా ఉంది. దీనికితోడు మలుపులతో కూడిన ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. పలు చోట్ల రక్షణగోడలు, ప్రమాద సూచికలు కూడా లేవు. ఈపరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే దారిపొడవునా వేలాది వాహనాలను దారిపొడవునా నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో పోలీసులు ఘాట్‌రోడ్డులో ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- నంద్యాల జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి
- బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

శ్రీశైలం, మార్చి 7: శ్రీశైలంలో కొనసాగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులతో గురువారం సమీక్ష జరిపారు. ముందుగా ఆలయంలో ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై ఆయన క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. క్షేత్రంలో 12 సెక్టార్లలో జోనల్ అధికారులను నియమించి నిరంతరం భక్తుల సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం, భక్తుల క్యూలైన్లపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం రోజు రాత్రి పాగాలంకరణ ముఖ్యమైన ఘట్టమని, కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు కిందిభాగంలో 4వేల మంది, మెట్ల మార్గంలో 750 మంది కూర్చుని వీక్షించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎక్కడ ఏటువంటటి సమస్య వచ్చిన కమాండ్ కంట్రోల్ రూముకు సమాచారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొబైల్ సిగ్నల్ సమస్య తలెత్తకుండా అధికారులందరికీ వైర్‌లెస్ సెట్లు ఇచ్చినట్లు జేసీ తెలిపారు.

రాష్ట్రంలో మొట్టమొదటి క్యాన్సర్ హాస్పిటల్

- బర్న్స్ వార్డు, పరీక్ష కేంద్రాలను ప్రారంభించిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన


క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 7: ఎట్టకేలకు రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రభుత్వ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభమైంది. గురువారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. దీంతో పాటు రూ.3.46 కోట్ల వ్యయంతో నిర్మించిన పది పడకల కాలిన రోగుల యూనిట్‌ను జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రూ.3.22 కోట్లతో నిర్మించిన పరీక్ష కేంద్రాన్ని ఎమ్మెల్సీ డా.మధుసూదన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి పూర్తి స్థాయి క్యాన్సర్ హాస్పిటల్‌లో కర్నూలులో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆధునికీకరణకు వందల రూ.కోట్లు, సిల్వర్ జూబ్లీ కాలేజీ, గాజులదిన్నె ప్రాజెక్టు ఆధునికీకరణ, నంద్యాలకు హైవే, కర్నూలు నగరానికి రూ.135 కోట్ల తాగునీటి పథకానికి ఖర్చు చేశామన్నారు. ఓ పక్క ఇంత అభివృద్ధి జరుగుతుంటే.. ప్రతిపక్ష పార్టీ నాయకులు మాత్రం అభివృద్ధి లేదని పేర్కొనడం అన్యాయమన్నారు. కొత్తగా స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.120 కోట్లు ఖర్చు పెట్టామని, ఇందులో రూ.36 కోట్లు భవన నిర్మాణానికి రూ.86 కోట్లు పరికరాలు, ఒక లినియర్ ఆక్సిలేటర్‌కు రూ.54 కోట్లు వెచ్చించామని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ డా.జి.సృజన, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకట రంగారెడ్డి, ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ యూనిట్ పనులపై మంత్రి ఆగ్రహం

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులు సరిగా చేయకపోవడంతో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ల అధికారులపై ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలు జీజీహెచ్ ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభోత్సవం సందర్భంగా సర్జికల్ అంకాలజీ వార్డులో ప్లాస్టింగ్ సరిగా చేయలేదని మండిపడ్డారు. కిటికీలు కూడా సరిగ్గా వేయలేదని, వర్షపు నీరు వస్తే బయటకు ఎలా వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మొదటి అంతస్థులో నిర్మాణం చేసిన గ్రానైట్ ఫ్లోరింగ్ సరిగ్గా లేదని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈపై మండిపడ్డారు. హాలులో బ్లాక్ గ్రానైట్ మధ్యలో ఎలా వేస్తారని, ఇది మరోచోట వేసి ఉండాల్సిందని అన్నారు.

దోపిడీ పాలనను తరిమి కొట్టండి

కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

డోన్, మార్చి 7: రాష్ట్రంలో దోపిడీ పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని, 2, 9, 12 వార్డులలో ఆయన పర్యటించారు. వార్డుల్లో మహిళలు కోట్లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని లూటీ చేశారని ధ్వజమెత్తారు. మద్య నిషేదం చేస్తానని చెప్పిన సీఎం జగన్ మాట తప్పారని, కల్తీ మద్యం విక్రయిస్తూ వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఉచితంగా లభించే ఇసుకను బ్లాకులో విక్రయిస్తూ ప్రజలను నిలువదోపిడీ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు, కార్మికులకు వైసీపీ పాలనలో తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీ కార్పొరేషన్లను ఆర్భాటంగా ఏర్పాటు చేసి పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బీసీ డిక్లరేషన్‌లో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు హయాంలో దళితుల సంక్షేమానికి అమలు చేసిన 29 పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. దోపిడీ పాలన చేస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పి మంచి విజన్ ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కొండపేటలోని దర్గాలో కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, శ్రీనివాసులు యాదవ్, మద్దయ్య గౌడు, భాస్కర్ నాయుడు, సుధీష్, అన్వర్ బాషా, మనోహర్, చంద్రపల్లి ఆచారి, ఎల్లగౌడు, రఘు, ఆర్ఈ నరసింహ, గురుస్వామి యాదవ్ పాల్గొన్నారు.

మిర్చి రైతులకు న్యాయం చేయండి..


మిర్చి ప్లాట్‌ఫారం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

కర్నూలు (అగ్రికల్చర్), మార్చి 7: కర్నూలు మార్కెట్ యార్డులో దశాబ్ద కాలంగా మిర్చి రైతులను వ్యాపారులు అక్రమాలతో ముంచెత్తుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ఆరోపించారు. గురువారం నగరంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో మిర్చి ప్లాట్‌ఫారం వద్ద రైతులకు సంఘీభావం తెలుపుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సురేంద్ర యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్నాథం మాట్లాడుతూ 20 రోజులుగా ఎండు మిర్చి ధర భారీగా తగ్గిపోవడానికి కారణం వ్యాపారులు సిండికేట్‌గా మారడమేనని ఆరోపించారు. క్వింటం 24వేల నుంచి 22 వేల దాకా ఉన్న ధర ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.5 వేలకు పడిపోయిందన్నారు. ఎకరాకు మిర్చి పంట సాగు కోసం రైతు రూ.2 లక్షల దాకా ఖర్చు పెడుతున్నారని, కనీసం పది క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రూ.లక్ష మాత్రమే రైతుల చేతికి అందే అవకాశం ఉందని అన్నారు. దీని వల్ల రైతులకు అప్పులు తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటానికి రూ.25వేల ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, రామక్రిష్ణ, రాజాగౌడు, శ్రీనివాసులు, పంపన్నగౌడు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అనంత్‌బాబును పదవి నుంచి తొలగించాలి

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్

కర్నూలు(కల్చరల్), మార్చి 7: ఎమ్మెల్సీ అనంత్‌బాబును పదవి నుంచి తొలగించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ శిబ్లీ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో సమతా సైనిక్‌దళ్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శిబ్లీ మాట్లాడుతూ 2022 మే 19న అనంత్‌బాబు దగ్గర డ్రైవర్‌గా పని చేస్తున్న దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను అతి కిరాతకంగా చంపి, తన కారులోనే తీసుకెళ్లడం చాలా దారుణమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అండదండలతో పోలీసు వ్యవస్థను మేనేజ్ చేస్తూ శిక్ష నుంచి తప్పించుకునేందుకు కుట్ర చేస్తున్న అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారురు. ఇప్పటికే హైకోర్టు తీర్పు ఇచ్చినా అతనిపై చార్జిషీట్ ఎందుకు ఫైల్ చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే అతనిని ఎమ్మెల్సీ పదవి నుంచీ తప్పించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో దళ్ రాయలసీమ అధ్యక్షుడు సి. రంగయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.

రసాయన ప్రమాదాల స్థాయిని తగ్గించవచ్చు

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఐ. నారాయణరెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 7: సహజ, మానవ నిర్మిత విపత్తులతో పాటు కెమికల్ డిజాస్టర్స్ నివారణపై విపత్తుల సంస్థ దృష్టి సారించిందని, దీనిపై ముందస్తు అవగాహన కార్యక్రమాలు, జాగ్రత్త చర్యలతో పాటు ప్రణాళికలు రూపొందించడం వలన రసాయనిక ప్రమాదాల స్థాయిని తగ్గించుకోవచ్చని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ. నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో కెమికల్ ఎమర్జెన్సీ మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య, రవాణా శాఖ ఎస్‌డీఆర్ఎస్, ఏపీఎస్పీఆర్ఎస్, కాలుష్య నియంత్రణ మండలి విభాగాలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో రసాయనిక ప్రమాదం జరిగితే ఎలా ప్రతిస్పందించి చర్యలు తీసుకునేదీ ప్రత్యక్షంగా చూపించారు. మాక్ ఎక్సర్‌సైజ్ వల్ల కెమికల్ డిజాస్టర్స్ జరిగినప్పుడు ఏ విధంగా కర్మాగారాల యజమాన్యం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సత్వరంగా చర్యలు తీసుకుంటాయని ఐ. నారాయణరెడ్డి తెలిపారు. కర్నూలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్నలక్ష్మి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాశ్ జయసింహ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం అనుపమ కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాద్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భారీగా నాటు సారా ఊట ధ్వంసం

కర్నూలు(అర్బన్), మార్చి 7: భారీగా నాటు సారా ఊటను, సారా బట్టీలను ధ్వంసం చేశామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం పరిధిలోని గుమితం తండాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. 1700 లీటర్ల బెల్లం ఊట, 40 లీటర్ల నాటు సారాను గుర్తించామని తెలిపారు. ఎం. శ్రీనివాసులుపై కేసు నమోదు చేశామని, ఈ దాడుల్లో ఎస్ఐలు సీ. రెహనాబేగం, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 7: టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్‌ను స్వాగతిస్తూ ప్రజల్లో విశేష స్పందన వచ్చిందని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయం ఎదుట చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఒకే వేదికపై చేరి ప్రజల్లో, బీసీల్లో భరోసా కల్పించే విధంగా వివరించడంతో అన్ని వర్గాల ప్రజలు కూటమి డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీసీ రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు యాదవ్, కాసాని మహేష్ గౌడ్, వెంకరాముడు, నాగరాజు యాదవ్, సుశీలమ్మ, రాజశేఖర్, కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు





విద్యుద్దీపాల అంకరణలో రూపాల సంగమేశ్వర స్వామి, బుగ్గ రామేశ్వరస్వామి ఆలయాలు

కర్నూలు(కల్చరల్), మార్చి 7: శివరాత్రికి నగరంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టులో వెలసిన ఉమాసహిత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం నుంచి శివరాత్రి వేడుకలు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రారంభిస్తున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యంతోపాటూ ఎండ నుంచి ఉపశమనానికి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. నగరంలోని హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వర స్వా మి ఆలయంలో, పాతనగరంలోని ఏటిగట్టు శివాలయం, రాంభొట్ల దేవాల యంలోని శివాలయం, అశోక్‌నగర్‌లోని ఆంజనేయ, సాయి బాబా శివాలయం, పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

ఓర్వకల్లు: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం నుంచి 13వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు.

● **బుగ్గ రామేశ్వరునికి ప్రత్యేక పూజలు** : మండలంలోని కాల్వ గ్రామంలో బుగ్గ రామేశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవమూర్తులను కాల్వ గ్రామం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు కాల్వబుగ్గకు చేరుకోనున్నాయి. ఉత్సవాల సందర్భంగా శుక్రవా రం నుంచి 13వ తేదీ వరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. శ్రీశైల దేవస్థానానికి అనుబంధమైన లద్దగిరి రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు వర్కూరు సిద్ధేశ్వరస్వామి ప్యాలకుర్తి భీమలింగేశ్వరస్వామి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి ఆలయాల్లో లింగోద్భవ ఘట్టం అనంతరం పంచామృతాభిషేకం, శివపార్వతులకు కల్యాణం నిర్వహించనున్నట్లు స్థానికులు తెలిపారు.



ముస్తాబైన లద్దగిరి రామలింగేశ్వరస్వామి ఆలయం

స్వార్థపరులను సాగనంపాలి

చిత్తారి వీధిలో టీజీ భరత్ భరోసా యాత్ర



టీడీపీలో చేరిన యువకులతో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 7: 2024 ఎన్నికల్లో స్వార్థపరులకు సాగనంపాలని కర్నూలు నియోజకవర్గం అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 5వ వార్డు నిమిషాంబ దే వి ఆలయం వద్ద నుంచి టీజీ భరత్ భరోసా యాత్రను ప్రారంభించారు. చిత్తారి వీధిలో పర్యటించి 6 గ్యారంటీల కరపత్రాలు ప్రజలకు అందించి మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలు, చెన్నారెడ్డి, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, లలితమ్మ, నాగరాజు, హిదాయత్, హేమలత, షఫిఉల్లా, కల్యాణి, ఎజాస్, ముక్తార్, ఇంద్రజ, హరిత, వసుందర, జనసైనికులు శ్రీనివాసరెడ్డి, విజయ్, కిరణ్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు కోనేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: నగరంలోని ఎస్‌ఆర్‌పేటలో వైసీపీకి చెందిన ఉదయ్, చంద్రకాంత్, అన్సర్, రాజ్యాలక్ష్మి టీడీపీ యువ నాయకుడు కౌశిక్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఈ ఐదేళ్ల వైసీపీ పాలన వల్ల చాలా నష్టం జరిగిందని, దీన్ని ప్రజలందరూ గ్రహించాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ గెలిస్తే యువకుల భవిష్యత్ బాగుంటుందన్నారు. ఈ ప్రభుత్వంలో రూ 5వేలు ఇచ్చి వలంటీర్ల ఉద్యోగంతో యువకుల మైండ్ మార్చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాశెట్టి శ్రీనివాసులు, జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకుడు సోమిశెట్టి హరి, శ్రీకాంత్, అన్వర్, వినోద్ పాల్గొన్నారు.











మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

» ఆర్‌యూ ఉపకులపతి సుధీర్ ప్రేమ్‌కుమార్





మాట్లాడుతున్న ఆర్‌యూ ఉపకులపతి, బహుమతులు అందుకున్న ఉద్యోగులతో జడ్పీ సీఈఓ

కర్నూలు(అర్బన్), మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉపకులపతి ప్రొఫెసర్ బీ.సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని రాయలసీమ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. డీన్ వెంకటసుందరానంద పుచ్చా, ప్రొఫెసర్లు సునీత, సుచిత్ర, అరుణ, ఆద్యాపకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలలో.. సమాజంలో మహిళా పాత్ర కీలకమని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అన్నారు. గురువారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ మానవ సృష్టిలో మహిళా స్థానం ప్రత్యేక మైందన్నారు. అనంతరం చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ జీ ఉమాదేవి, ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ హెచ్ ఆక్తర్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ ఆర్ ప్రసాదరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): మహిళలు లేనిదే సమాజం లేదని జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. గురువారం జడ్పీ మినీ సమావేశ భవనంలో పరిపాలన అధికారులు సరస్వతి, సౌభాగ్యలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఈఓ జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంస్కృతిక కార్యక్ర మాలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహకంగా పాల్గొని, సినిమా జానపద పాటలకు నృత్యాలు చేశారు. ఆటల పోటీ టల్లో గెలుపొందిన మహిళా ఉద్యో గులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుమలేశ్వరరెడ్డి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మెప్మా అధ్వర్యంలో.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక అన్నారు. మెప్మా అధ్వర్యంలో న్యూ కౌన్సిల్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, న్యాయవాది నాగలక్ష్మి హాజరయ్యారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ రిలేషన్స్ ఈఫామ్ సిస్టమ్స్ సీనియర్ టాలెంట్ డెవలప్మెంట్ స్పెషలిస్టు కాజల్ తివారి, రవీంద్ర విద్యాసంస్థల సీఈవో డా.జే.మతా మోహన్, సీఎస్ హాస్పిటల్ గైనకాలజిస్టు డా.ఆర్.శ్రావ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్స్ కేఈ శ్రీనివాసమూర్తి, సి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్లూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కల్లూరు ఎంపీపీ బి.శారద అన్నారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ మద్దీశ్వరమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలకు క్రీడలు ఏర్పాటు చేసి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

పోస్టర్ విడుదల

కర్నూలు(హాస్పిటల్), మార్చి 7: నగరంలోని మెడికవర్ హాస్పిటల్ పరిధిలో మహిళల కోసం ప్రత్యేక వైద్య సేవలను అందించనున్నట్లు ఆసుపత్రి క్లస్టర్ హెడ్ మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో మహిళలకు రూ.4వేలతో వైద్య సౌకర్యా లను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సేవలకు సం బంధించిన పోస్టర్లను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ నీలారెడ్డి పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో ఘనంగా ఫ్లేవర్ గ్యాలోర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలోని ఐ-కిడ్స్ విభాగంలో పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాల్సిన ప్రథమ బాధ్యత మాతృమూర్తిదే అని తెలియజేయడం కోసం ఫ్లేవర్ గ్యాలోర్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మాంటిస్సోరి పాఠశాలల అధినేత కేఎస్‌వీ రాజశేఖర్ మాట్లాడుతూ చాలా మంది పిల్లలు బయటి ఆహార పదార్థాలకు ఆకర్షితులై ఆరోగ్యాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. అలా జరగకుండా ఉండాలనే అమ్మలాలిపాట ఎంత తియ్యనో.. అమ్మ చేతి వంటి అంతకంటే తియ్యన అని ప్రతి అమ్మ తమ బిడ్డలకు తెలియజేయాలన్నారు. ముఖ్య అతిథిగా సి.శశికళ, పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రాధ, ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి పాల్గొన్నారు.

కుడా చైర్మన్ కోట్లకు షాక్

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరిన గోరంట్ల వాసులు

కర్నూలు(రూరల్), మార్చి7: కోడుమూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి షాక్ తగిలింది. ఆయన వర్గానికి చెందిన దాదాపు వంద కుటుంబాలు వైసీపీని వీడారు. కోడుమూరు మండలం గోరంట్ల గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకుడు సద్దల శ్రీనివాసులు, డీలర్ శివుడు మరో వంద మంది గురువారం కర్నూలులో టీడీపీ సీనియర్‌నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సద్దల శ్రీనివాసులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు. వారికి విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గోరంట్ల వాసులు మాణిక్యం, నగేష్, ఈశ్వరయ్య, వేణు, ఈశ్వరయ్య, మాధవస్వామి, ఎద్దులక్ష్మన్న, ఉమాకాంతరెడ్డి, రామాంజనేయులు, చిన్నమాధన్న, మాదులు, తేరుకాటి శ్రీను, వంకాయల క్రిష్ణ, అయ్యన్న, చాకలి వెంకటేశ్వర్లు గిడ్డయ్య, మంగమ్మ పాల్గొన్నారు.

● గూడురు మండలం జులకల్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎల్ సుధాకర్‌రెడ్డి వర్గీయులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరికి మద్దతు ప్రకటించారు. ఆదాము, అయ్యప్ప, సజీవ, సురేష్, ప్రేమ రాజు, సులేమాన్, హనుమంతు, సుందర్‌రాజు ఉన్నారు.

అశోకా కళాశాలలో అవార్డుల ప్రదానం



అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న అతిథులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక దూపాడులోని అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం అశోకా-సాచి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. విద్యారంగంలో అత్యుత్తమ కృషి చేసిన మహిళా మార్గదర్శిలకు అశోకా సాచీ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా అవార్డుల ప్రెజెంటర్స్‌గా మాంటిస్సోరి కరస్పాండెంట్ డా.గాయనీ రాజశే ఖర్, డా.పి.సుజాత, డైరెక్టర్-జేఎన్‌టీయుజే, ఉస్మానియా కళాశాల కరస్పాం డెంట్ అజ్రాజావేద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అశోకా కాలేజ్ చైర్మన్ అశోక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల హోదాలలో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్, టీచర్స్‌గా పని చేస్తూ వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డులతో వారిని సత్కరిస్తున్నామన్నారు. కళాశాల సీఈవో డా.హరీష్ కృష్ణా, ప్రిన్సిపల్ డా.నవీన్, కాలేజీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ హంసా అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు



మాట్లాడుతున్న హంసా సిటీ చైర్మన్ గోవిందు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 7: వైద్యఆరోగ్యశాఖలో అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంసా)కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చిందని కర్నూలు నగరాధ్యక్షుడు టి.గోవిందు తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ ఆవరణంలో గురువారం సాయంత్రం అసోసియేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఏపీ హంసా యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు కల్పిస్తూ జీవో.నెంబర్. 24ను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏపీ హంసాకు గుర్తింపు రావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కార్తీక్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటస్వామి, మాబుమబియా, ఈసీ సభ్యులు రాముడు, శేషరాం, మాలిక్‌బాషా, డ్రైవర్ రాజు పాల్గొన్నారు.

ఎండోమెంట్ కాలనీలో చోరీ

కర్నూలు, మార్చి 7: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎండోమెంట్ కాలనీలో ఓ కాలేజీ ప్రిన్సిపాల్ ఇంట్లో చోరీ జరిగింది. కామేశ్వరి అనే మహిళ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తుంది. గత నెల 24న సొంతూరు వెళ్లింది. తిరిగి ఈనెల 4న ఇంటికి వచ్చింది. ఇంటి తాళం తెరిచి ఉంది. బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారు నగలు, రూ.30వేలు నగదు, కిలోన్నర వెండి నగలు మాయమయ్యాయి. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఆమె ఇంటికి వెళ్లి పరిశీలించారు.

నిజం గెలవాలి యాత్రను విజయవంతం చేద్దాం

గూడూరు, మార్చి 7: నిజం గెలవాలి యాత్రను విజయవంతం చేద్దామని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం గూడూరు పట్టణంతో పాటు పెంచికలపాడు గ్రామాల్లో భువనేశ్వరి పర్యటించి మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఓదార్చుతారన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కర్నూలు(న్యూసిటీ): పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై కర్నూలు అసెంబ్లీ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ) భార్గవతేజ గురువారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల మార్పు తదితర విషయాలపై చర్చించారు.

బాలనటుడికి టీజీ భరత్ అభినందన

కర్నూలు(కల్చరల్), మార్చి 7: తెలుగు సినీ కథానాయకుడు గోపీచంద్ నటించిన భీమ చిత్రంలో బాల నటుడిగా నటించిన కర్నూలుకు చెందిన విద్యార్థి కె. ప్రణవ్‌ను టీడీపీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ అభినందించారు. గురువారం మౌర్య ఇన్‌లోని టీజీ భరత్ ఛాంబర్‌లో ప్రణవ్ తన తల్లిదం డ్రులు కవిత, సురేశ్‌లతోపాటూ జిల్లా తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మాస్టర్ టి.వెంకటేశ్వర్లుతో కలిసి టీజీ భరత్‌ను కలిశారు. ఈ సందర్భంగా టీజీ భరత్ తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన ప్రణవ్‌ను అభినందించి, సర్టిఫికెట్‌ను అందజేశారు.

టీడీపీ గెలుపు కోసం పని చేయండి

ఓర్వకల్లు, మార్చి 7: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం పని చేయాలని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో కాల్వ, సోమయాజులపల్లె, చెన్నంచెట్టిపల్లె, కొమరోలు, వెంకటాపురం గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ బీసీ సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బీసీల కోసం పలు పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే రూ.4వేలు పింఛన్, బీసీ చట్టం, ఆదరణ తదితర పథకాలపై వివరించారు.

వైసీపీని సాగనంపేందుకు సిద్ధం

కర్నూలు(రూరల్), మార్చి7: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం పి.రుద్రవరం గ్రామంలో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను దస్తగిరి ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, వెంకటేశ్వరగౌడ్, బోయలాలు, వెంకటేష్, శ్రీనివాసులుగౌడ్, ఎల్లాగౌడ్, గోపాల్‌గౌడ్, లక్ష్మన్న, నాయుడు, విక్రమ్, సురేష్ పాల్గొన్నారు.







రోడ్డెక్కిన చిన్నారులు

● రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని ఆందోళన

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 7: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. గురువారం ఆర్‌యూఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌యూఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశామని గొప్పలు చెప్పుకుంటూ విద్యార్థులకు విద్యకు దూరం చేస్తున్నారన్నారు. పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను ఎన్నిసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను నియమించలేని సీఎం విద్యార్థులకు ఏవిధంగా మేలు చేస్తున్నారో చెప్పాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను వలసలకు తీసుకెళ్తున్నార ని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్, విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు



కర్నూలు రహదారిపై బైఠాయించిన గార్లదిన్నె పాఠశాల విద్యార్థులు

ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిమ్మగురుడు, నాగన్న, సీమోన్, షడక్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వాకీటాకీలను కాకులు ఎత్తుకెళ్లాయా..?

● అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ఆదోని టౌన్, మార్చి 7: 'గతంలో సిబ్బందికి ఇచ్చిన వాకీటాకీలు ఏమయ్యాయి..? ప్రస్తుతం ఒక్కటి కూడా కనిపించడం లేదు. కాకులు ఏమైనా ఎత్తుకెళ్లాయా...?' అని కౌన్సిలర్ వైజీ బాలాజీ అధికారులను ప్రశ్నించారు మున్సిపల్ కౌన్సిల్ చైర్ పర్సన్ బోయ శాంత అధ్యక్షతన గురువారం అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షలు ఖర్చు చేసి సిబ్బందికి పరిపాలన సౌలభ్యం కోసం వాకీటాకీలను అందించారని, అవి ప్రస్తుతం ఒక్కరి చేతిలో కూడా కనిపించడం లేదని, కనుమరుగు కావడంపై సమాధానం చెప్పాలని కోరారు. వాటి మరమ్మత్తులు, నిర్వాహణ కోసం బడ్జెట్‌లో రూ.15 లక్షలు కేటాయించడం సమంజసం కాదని విమర్శించారు. అవసరానికి పనికి రాకుండా పోయిన వాటి కోసం రూ.లక్షలు ఖర్చు పెట్టడంలో అర్థం లేదన్నారు. కౌన్సిలర్ రఘు మాట్లాడుతూ రోడ్డు మార్కింగ్ (ట్రాఫిక్ గుర్తులు) కోసం రూ.15 లక్షలు మంజూరు చేశారని, గతంలో కూడా రోడ్డు మార్కింగ్ పేరుతో మంజూరు అయిన నిధులతో ఎక్కడ ఖర్చు చేశారో తెలియదని పేర్కొన్నారు. కౌన్సిలర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, రంజాన్


అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ వైజీ బాలాజీ

మాసం ప్రారంభం అవుతుండటంతో మైనారిటీలకు చెందిన ప్రార్థన స్థలాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కొత్తగా వచ్చిన కమిషనర్ రామచంద్ర రెడ్డి కౌన్సిల్ సభ్యులకు తన పరిచయం చేసుకున్నారు. సమావేశంలో ఎంఈ వెంకట చలపతి, ఆర్వో అస్లాం, ఏఈ రాజశేఖర్ రెడ్డి, మీటింగ్ క్లర్క్ చంద్రమోహన్, సానిటరి ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. నిర్మల
- ఘనంగా మహిళా దినోత్సవం

ఎమ్మిగనూరు, మార్చి 7: మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కాలరాస్తున్నాయని శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్ నాగలక్ష్మీ అధ్యక్షతన అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నిర్మలమ్మ మాట్లాడారు. మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకపడ్డారన్నారు. రాష్ట్రంలో హక్కులు అడిగితే సీఎం జగనన్న మహిళలను పోలీసులతో లాటీలతో దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు నాగమణి, గోవర్ధనమ్మ, శివలక్ష్మి, శైలజ, మల్లీశ్వరి, గౌసియా, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు గోవిందు, రాముడు పాల్గొన్నారు.

డిగ్రీకళాశాలలో : పట్టణంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, సుశీలమ్మ, డాక్టర్ పాల్ దేవదానం, కమర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో..

ఆదోని (అగ్రికల్చర్) : పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శాంతి జ్యోతి పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కుల కోసమే కాదు, అన్ని


ఆర్ట్స్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శిశిర దీప్తి, డాక్టర్ శాంతి

రంగాలలో రాణించాలని సూచించారు. అనంతరం కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ విజయలక్ష్మి, చైర్మన్ విట్టా సతీష్, కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. మిల్టన్ గ్రామర్ పాఠశాలలో రెడ్ రిబెన్ క్లబ్ సభ్యురాలు సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో రెవెన్యూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు అలివేలు, సుజాత వెంకటమ్మ, భాను, పద్మ, సరోజ, సోమక్క, కరుణ, శంకరమ్మ, గీత, శ్రీదేవి, ఉమ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

ఆలూరు: ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ సుశీలను ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యం అందక రెండు రోజుల్లో ఇద్దరు మృతి

- గజ్జెహళ్లి ఆసుపత్రి ఎదుట గ్రామస్థుల నిరసన
- అత్యవసర స్థితిలో ఆసుపత్రికి వస్తే అందని వైద్యం
- డ్యూటీ డాక్టర్‌తో వాగ్వాదం
- చర్యలు తీసుకోవాలంటూ బైఠాయింపు

హొళగుంద, మార్చి 7: వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఐదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మరువక ముందే అదే గ్రామానికి చెందిన మంగళి అంజి (35) సకాలంలో వైద్యం అందక మృతిచెందిన సంఘటన గజ్జెహళ్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. అంజి తన ఇంటి వద్ద స్పృహ తప్పి కింద పడటంతో కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు, వైద్య సిబ్బంది ఒక్కరూ అందుబాటులో లేకపోవడంతో ఆదోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో మృతుడి బంధువులు, గ్రామస్తులు గ్రామ పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. ఆలస్యంగా విధులకు హాజరైన డ్యూటీ డాక్టర్ రాధమ్మతో వాగ్వాదానికి దిగారు. రెండు రోజుల్లో గ్రామానికి చెందిన ఇద్దరు చనిపోయారని, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వస్తే డాక్టర్లు, స్టాఫ్ నర్సులు ఎవ్వరూ అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం కోసం గ్రామం నుండి పది కిలోమీటర్ల దూరంలోని పెద్దహరివాణం లేదా ఆదోనికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. డాక్టర్లు స్థానికంగా ఉండకుండా, ఆదోనిలో ఉంటున్నారని, ఆసుపత్రికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో వస్తున్నారని, మూడు గంటలకు ఇళ్లకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సత్యవతిని వివరణ కోరగా, డాక్టర్లు, డ్యూటీ సమయపాలన పాటించాలని, ఆసుపత్రి 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్ల గురించి జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

జగన్‌ను గద్దె దింపుదాం

- బీవీ జయనాగేశ్వరరెడ్డి పిలుపు
- జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఇంటింటి ప్రచారం
- బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాల పంపిణీ


మాట్లాడుతున్న జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 7: ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తూ అందరినీ కష్టాలపాలు చేసిన సీఎం జగన్‌ను గద్దెదింపేందుకు సిద్ధం కావాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరులోని 15వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాబుష్యూరిటీ భవిషత్‌గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ మాటలకు మోసపోయారని, ఈ సారి మేల్కొని టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 15వ వార్డు మాజీ కౌన్సిలర్ ముల్లాఖలీముల్లా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, టీడీపీ కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, మాజీ కౌన్సిలర్లు మిఠాయి నరసింహులు, రంగస్వామిగౌడు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర : మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విఠోభ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజనేయులు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఎన్.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో టీడీపీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్ర, మాస్టారు, సుగ్గులప్ప తదితరులు ఉన్నారు.

తుగ్గలి : టీడీపీ జిల్లా గిరిజన నాయకులు రామూ నాయక్, సర్పంచ్ శంకరమ్మ ఆధ్వర్యంలో సూర్యతండా, మిద్దె తండాలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మణ్ నాయక్, శంకర్ నాయక్, తిరుపాల్ నాయక్, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

వేదవతి ప్రాజెక్ట్ పూర్తి చేయాలంటూ పాదయాత్ర


టీడీపీ నాయకులు ఎల్లార్తి బోయ మల్లికార్జున

ఆలూరు, మార్చి 7: ఆలూరు ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే వేదవతి ప్రాజెక్ట్ ఎంతో అవసరమని తక్షణమే నిధులు విడుదల చేసి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ గురువారం వేదవతి ప్రాజెక్ట్ సాధన మితి ఆధ్వర్యంలో గూళ్యం నుంచి ఆలూరుకు పాదయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా ఆలూరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. టీడీపీ నాయకులు ఎల్లార్తి మల్లికార్జున, సురేంద్ర వేదవతి ప్రాజెక్ట్ సాధన కమిటీ సభ్యులు అర్జున్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి ఉంటే నేడు కరువు నుంచి ఆలూరు ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో విముక్తి కలిగేదని అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి వేదవతి ప్రాజెక్టును నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ వేగవంతం

● స్థానికులను విచారించిన డీఎస్పీ

ఆదోని రూరల్, మార్చి 7 : ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన దళిత మహిళ జయమ్మపై దాడి చేసి గాయపరిచిన వైసీపీ నాయకుడు ఆదోని కల్లుబావికి చెందిన పురుషోత్తంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా, ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, రూరల్ ఈఐ నీరంజన్‌రెడ్డి, ఇస్వీ ఎస్.ఐ శ్రీనివాసులుతో కలిసి గురువారం నాగనాథనహళ్ళి గ్రామంలో పర్యటించారు. నేరస్థలాన్ని పరిశీలించడంతోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానికులను విచారించారు.

బాధిత మహిళకు పరామర్శ

ఆదోని రూరల్, 7 : మద్యం మత్తులో దుర్మార్గంగా దళిత మహిళను చీర కొంగు లాగి, రాడ్‌తో దాడి చేసిన వైసీపీ నాయకుడు ఆదోని కల్లుబావి పురుషోత్తంరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ కుల వివక్ష పోరాట సమితి అధ్యక్ష, కార్యదర్శులు తిక్కప్ప, మునిస్వామి, డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన మాదిగ జయమ్మను వారు పరామర్శించారు.

క్రైస్తవుల హక్కులను కాపాడేవారికే మద్దతు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 7: క్రైస్తవుల హక్కులను తమ మేనిఫెస్టోలో చేర్చి రక్షణగా నిలిచే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఆదోని క్రిస్టియన్ యునైటెడ్ చర్చిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్వరికొండ ఆనంద్ రాజు అన్నారు. గురువారం పట్టణంలోని రాజశ్రీ హాలులో యూసీఏ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు క్రైస్తవులు ఎన్నికల సమయాల్లో మాత్రమే గుర్తుకొస్తున్నామని, ఎన్నో మార్లు తమ సమస్యల పై గళమెత్తాలని విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో క్రైస్తవుల కమ్యూనిటీ హాలుకు ఎకరా కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో క్రైస్తవుల సమాధులకు స్థలాలు ఇవ్వాలన్నారు. చర్చిల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు సులభతరం చేయాలని కోరారు. సమావేశంలో ఏసీయూసీఏ ప్రధాన కార్యదర్శి ఎజ్రా శ్రీధర్, ట్రెజరర్ థామస్, గౌరవ అధ్యక్షుడు ఆల్బర్ట్, సభ్యులు బెనర్జీ రాజు, మనోహర్, జేమ్స్, దేవదాసు, నీలాంబరం, సంగటి దేవదానం పాల్గొన్నారు.

'న్యాయవాద వృత్తిలో రాణించాలి'

పత్తికొండ టౌన్, మార్చి 7: న్యాయవాద వృత్తిలోకి న్యాయవాదులు రాణించాలని న్యాయాధికారి జస్టిస్ దివ్య సూచించారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో సాకలి సాంబశివ, రాణెమ్మ పత్తికొండ న్యాయవాదులుగా సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన న్యాయాధికారి దివ్య మాట్లాడుతూ యువ న్యాయవాదులు తమ వృత్తిలో రాణించాలన్నారు. సీనియర్ న్యాయవాదుల సలహాలు సూచనలు తీసుకుని వివిధ రకాల సెక్షన్లు, జడ్జిమెంట్ల గురించి అవగాహన పొందాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, న్యాయవాదులు నరసింహాచారి, రమేష్‌బాబు ఉన్నారు.

10న గురుకుల బాలికల పాఠశాలలో ఎంట్రెన్స్ టెస్ట్

పత్తికొండ టౌన్, మార్చి 7: పత్తికొండ డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గానూ ఈ నెల 10న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పత్తికొండ డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఉమా కుమారి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబందించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

విద్యార్థిని చితకబాదిన హెచ్‌ఎం

దేవనకొండ, మార్చి 7 : విద్యార్థి తమ మాట వినడం లేదని పాఠశాల ఆవరణలో తోటి విద్యార్థుల ఎదుటే హెచ్‌ఎం, కరస్పాండెంట్ లు పదో తరగతి విద్యార్థి జస్వంత్‌ను చితకబాదారు. విద్యాబుద్ధులు చెపాల్సిన గురువులే చెలరేగిపోవడంతో తోటి విద్యార్థులు మౌనంగా చూస్తూ ఉండి పోయారు. దేవనకొండలోని ఓ ప్రైవైట్ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకోంది. విద్యార్థి శరీరంపై గాయాలను చూసి కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.


కందిపోయిన విద్యార్థి శరీరం

కోటకొండలో మలేరియా కేసు నమోదు

దేవనకొండ, మార్చి 7: పి.కోటకొండలో మలేరియా కేసు నమోదైనట్లు జిల్లా అసిస్టెంట్ అధికారి చంద్రశేఖర్, సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. గ్రామానికి చెందిన బడేసాహెబ్ అనే వ్యక్తి మలేరియా బారినపడటంతో గ్రామంలో దోమల నివారణకు పిచికారి చేసి, జ్వరం వచ్చినవారికి రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు

ఏపీఈఎండీపీలో చెరుకులపాడు విద్యార్థుల ప్రతిభ

వెల్దుర్తి, మార్చి 7: చెరుకులపాడు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు బుధవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏపీఈఎండీపీ ఎక్స్‌పోలో ప్రతిభ కనబరచి ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. గురువారం హెచ్‌ఎం రంగారెడ్డి పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేసి మాట్లాడారు. 'స్మార్ట్ కంపోస్ట్ క్రషర్' నమూనాతో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారన్నారు. విద్యార్థినులు ఎ.రేణుక, కె.వాణిలకు మార్గదర్శిగా ఉంటూ ప్రోత్సహించిన ఉపాధ్యాయులు చాముండేశ్వరి కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

మంత్రాలయంలో ఉద్యోగ మేళా

మంత్రాలయం, మార్చి 7: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం రాఘవేంద్ర డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా నిర్వహించారు. గురువారం కళాశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పేటీఎం సంస్థ అమర్‌రాజ్ గ్రూపు, ఫూజన్ మైక్రో ఫైనాన్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, గ్రెయిన్‌డ్రక్కన్ ప్రైవేటు లిమిటెడ్, స్కై స్క్వాడ్ ఎలక్ట్రానిక్, నవభారత్ ఫర్టిలైజర్, శ్రీరామ చిట్స్, వికాస, ధ్యాన్‌కర్మ సర్వీసెస్ సంస్థలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఆయా కంపెనీలకు అవసరమైన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగులుగా నియమించుకునేందుకు ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎస్ఐ గోపీనాథ్, కురువ మల్లికార్జున, వెంకటేశ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధిని విస్మరించిన జగన్

ఆలూరు, మార్చి 7: జిల్లాలో నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించుకున్న మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంపై వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ అన్నారు. గురువారం ఆలూరు ఆర్&బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్లపాటు ఆలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించిన గుమ్మనూరు జయరాంకు వైసీపీలో టికెట్ ఇవ్వకపోవడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురై పార్టీ మారాడన్నారు. ఈ విషయం పై వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి మీడియా సమావేశం పెట్టి టీడీపీ నాయకులను బెదిరింపులకు గురి చేసేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

సంక్షిప్త సమాచారం

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు, మార్చి 7: నెట్రవట్టికి వెళ్లే క్రాస్ రోడ్డులో కర్ణాటక నుంచి ఏపీలోకి మారుతీ స్విఫ్ట్ కారులో 30 బాక్సుల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. ఈ తనిఖీలలో డ్రైవర్‌తో పాటు మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే కారును వదిలేసి పారిపోయినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1,81,440 ఉంటుందన్నారు. ఈ కేసులో ఇద్దరు కర్ణాటక వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ కానిస్టేబుల్ విజయుడు, ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాంసాహార విక్రయాలపై నిషేధం

ఆదోని టౌన్, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం పట్టణ పరిధిలో అన్ని రకాల మాంస విక్రయాలను నిషేధించినట్లు కమిషనర్ రామచంద్ర రెడ్డి గురువారం తెలిపారు చిన్న, పెద్ద కబేలాలలో ఎలాంటి జంతువులను వధించరాదని, పట్టణ పరిధిలో ఎక్కడా మటన్, చికెన్‌లతో పాటు చేపల విక్రయాలు కూడా నిషేధించామని తెలిపారు.

వైసీపీకి రాజీనామా

ఎమ్మిగనూరు, మార్చి 7: పట్టణంలోని రెండో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు శిరసాల రాము వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గురువారం రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పంపినట్లు ఆయన తెలిపారు. 2004నుంచి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వెంట ఉన్నామని తెలిపారు. వారికి టికెట్ రాకపోవడంతో తాము పార్టీలో కొనసాగలేమని పార్టీకి రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

● బైక్‌లో ఉంచిన రూ.3 లక్షలు దొంగతనం

ఆదోని, మార్చి 7: ఆదోని పట్టణంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.3 లక్షల నగదు సినీఫక్కీలో చోరీకి గురైంది. ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న చెన్నయ్య అనే ఉద్యోగి బ్యాంకు నుంచి తన అవసరాల కోసం రూ.3 లక్షలు నగదును డ్రా చేసుకొని వచ్చారు. ఆ డబ్బును యూనియన్ బ్యాంకులో జమ చేయాలని అనుకున్నాడు. దాహం వేస్తుండటంతో పక్కనే ఉన్న, తను పనిచేసే ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయానికి నీళ్లు తాగేందుకు బైక్‌లో డ్రా చేసిన నగదు ఉంచి లోపలికి వెళ్ళాడు. కార్యాలయంలో నీళ్లు తాగి బయటికి వచ్చేలోపు నగదు అవహరణకు గురైంది. బైక్‌లో ఉన్న రూ.3 లక్షలు నగదు కనిపించకపోవడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. చుట్టుపక్కల విచారించగా అందరూ తెలియదని చెప్పడంతో దిక్కు తోచలేదు. వెంటనే రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితుడు చెన్నయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. సీసీ కెమెరాలు కార్యాలయం ఆవరణంలో లేకపోవడంతో ఇతర కోణాలతో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

ఆస్పరి, మార్చి 7: మండల కేంద్రం ఆస్పరి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ విజయజ్యోతి కుమారి, సైట్ ఇంజనీర్ విష్ణువర్ధన్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి సమస్యతో అల్లాడి పోతున్నామని విద్యార్థినులు ఆమె దృష్టికి తెచ్చారు.